వెళ్లొస్తాం.. మళ్లొస్తాం!



రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో రద్దీ..

సామర్లకోట/అమలాపురంటౌన్/జనవరి16: సంక్రాంతి సంబరాలు ముగిశాయి. మూడు రోజులపాటు ప్రజలంతా ఆనందంగా గడిపారు. బంధుమిత్రులతో విందులు, కోడిపందాలు, గుండాటలు, పేకాటలతో సందడి చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను కొంతమంది చుట్టివస్తే, మరికొందరు ఆలయాలను దర్శించారు. సినిమాలు, షికార్లతో ఇంకొందరు ఉల్లాసంగా గడిపారు. మూడు రోజులు ముగియడంతో దూరతీరాల నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు లక్షలాదిగా తరలివచ్చిన బంధుమిత్రులంతా ఇప్పుడు తిరుగు ప్రయాణం బాటపట్టారు. సంక్రాంతికి రెండు రోజుల ముందే ఈసారి బంధుగణం వేలాదిగా గ్రామాలకు తరలివచ్చారు. విదేశాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి కార్లు, బైక్‌లు తదితర వాహనాల్లో భారీగా వచ్చారు. గత శనివారం ఉదయానికే పెద్దఎత్తున జిల్లాకు చేరారు. వరుస సెలవులు కలసిరావడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు అందరూ మధ్యలో సెలవులు పెట్టుకుని మరీ తమ తమ స్వగ్రామాలకు తరలివచ్చారు. ముఖ్యంగా ఈనెల 11న రెండవ శనివారం కావడంతో ఆది, సోమ, మంగళ, బుధవారాలు పండుగ సెలవులు కలిసి రావడంతో చాలామంది శుక్రవారం రాత్రే పండుగ జరుపుకోవడానికి స్వగ్రామాలకు చేరుకున్నారు. పండగ పూర్తికావడంతో ఇప్పుడు పట్టణాలకు తిరుగు ప్రయాణం కట్టారు. గురువారం ముక్కనుమ కావడంతో తిరుగు ప్రయాణాలు ఆరంభమయ్యాయి. దీంతో అన్ని రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు ప్రయాణికులు, లగేజీలతోనూ కిటకిటలాడాయి. అత్యధికులు ముక్కనుమ పండుగ పూర్తి చేసుకుని గురువారం సాయంత్రం తమ తమ గమ్యస్థానాలకు బయలుదేరడంతో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం సహా అన్నిచోట్ల నుంచి తిరుగు ప్రయాణంలో ఉన్న కార్లు, బస్సులతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. రాజమహేంద్రవరం, సామర్లకోట రైల్వే స్టేషన్లు కిటకిటలాడాయి. ఆర్టీసీ ముందస్తు ఏర్పాట్లు చేశామని చెప్పినా అవేవీ ప్రయాణికుల అవసరాలను తీర్చే స్థాయిలో లేవు. ప్రతి బస్టాండ్‌లోనూ వందలాది మంది ప్రయాణికులు గంటల తరబడి వేచిచూడడం కనిపించింది. అటు పండుగలో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు ముందుగా ప్రకటించిన రైల్వే తదనంతరం ప్రయాణికుల రద్దీ ఆశించినరీతిలో లేదంటూ అర్ధంతరంగా రద్దుచేయడంతో ప్రత్యేక రైళ్లల్లో ప్రయాణించేందుకు ఆయా స్టేషన్లకు చేరుకున్న వారంతా రద్దు సమాచారంతో తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. ప్రైవేట్ బస్సుల ట్రావెల్స్ వారు సైతం మూడు నుంచి నాలుగు రెట్లు అదనపు చార్జీలను వసూలు చేయడంతో ప్రయాణికులు తిరుగు ప్రయాణంలోనూ నిలువుదోపిడీకి గురికాక తప్పలేదు. ఇక విమానాలదీ ఇదే పరిస్థితి. మధురపూడి ఎయిర్‌పోర్ట్ ఖాళీ లేకుండా ఉంది. తిరిగి వెళ్లే ప్రయాణికులతో రద్దీ నెలకొంది. టిక్కెట్ ధర డబుల్ చేసినా ప్రయాణికులు వెనుకడుగు వేయడంలేదు. ఇక ప్రైవేట్ ట్రావెల్స్‌కి డిమాండ్ పెరిగింది. దాంతో చార్జీలు బాదేశారు.

- ముగిసిన సంక్రాంతి పండుగ
- తిరుగు ప్రయాణాలతో రద్దీ
- ఫుల్‌గా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు
- మళ్లీ ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ
- కార్లు, బైక్‌లతో పెరిగిన ట్రాఫిక్
- రద్దీగా మారిన రహదారులు
- విమానాశ్రయం కిటకిట

రహదారులన్నీ కిటకిట..

సంక్రాంతి పండుగ వచ్చినవారు తిరుగు ప్రయాణంలో ఉండడంతో రోడ్లన్నీ రద్దీగా మారాయి. మళ్లీ తమ తమ విధులకు హాజరయ్యేందుకు ప్రయాణికులు కార్లు, బస్సుల్లో బయలుదేరడంతో దాదాపు అన్ని రోడ్లలో ట్రాఫిక్ స్తంభించింది. జాతీయ రహదారులు కిక్కిరిసిపోయాయి. రావులపాలెం నుంచి విజయవాడ వెళ్లే రహదారి.. ఇటు దివాన్‌చెరువు నుంచి విజయవాడ వెళ్లే రహదారులు రద్దీగా కనిపించాయి. టోల్‌గేట్ల వద్ద వాహనాలు బారులు తీరాయి. మరోవైపు పెట్రోల్ బంకుల్లోనూ రద్దీ కనిపించింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. తిరుగు ప్రయాణంలో సొంత వాహనాల్లో ఊళ్లకు బయలుదేరడంతో ఎక్కడి కక్కడ రద్దీ కనిపించింది. ఆర్టీసీ డిపోలో బస్సుల కోసం గురువారం ఉదయం నుంచి ప్రయాణికులు నిరీక్షించారు. ఆర్టీసీ హైదరాబాద్‌తోపాటు ముఖ్య పట్టణాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేసినా ప్రయాణికుల కొరతను తీర్చలేకపోయింది. దాంతో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను ఆశ్రయించాల్సిరావడంతో పెద్దఎత్తున దోచుకుంటున్నారు.



కాకినాడ బస్టాండ్‌లో ఇలా..



బస్టాండ్ కిటకిట

సెంటిమెంట్‌తో.. ఆగారు!

రాజమహేంద్రవరం అర్బన్/సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి తిరుగు ప్రయాణాలు ప్రారంభమయ్యాయి. ప్రధానంగా హైదరాబాద్‌కు సొంతూర్ల నుంచి ప్రయాణికులు బయలుదేరివెళ్లారు. వీరంతా ముందుగా తిరుగు రిజర్వేషన్లు చేసుకున్నవారే. గురువారం తూర్పుగోదావరి జిల్లా నుంచి హైదరాబాద్‌కు ఆరు స్పెషల్ సర్వీసులు నడిపారు. శుక్రవారంపొద్దు సెంటిమెంట్‌తోపాటు ముక్కనుమ కారణంగా చాలామంది ప్రయాణాలు మానుకున్నారు. అయితే శని, ఆదివారాల్లో రష్ భారీగా ఉండొచ్చని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారంతా ఆదివారం వరకు సెలవులు పెట్టుకుని రావడంతో కొందరు ఆలస్యంగానే తిరుగుపయనం అవుతున్నారు. పండుగ సెలవులతోపాటు శని, ఆది వారాలు కలుపుకుని మిగతా రోజులు సాధారణ సెలవులు తీసుకుని ఏకంగా తొమ్మిది, పది రోజులపాటు స్వగ్రామాల్లోనే ఉండిపోవడం ఈసారి విశేషం. ఈ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని బట్టి అవసరమైతే ఈ రూట్లలో స్పెషల్స్ నడుపుతామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి హైదరాబాదుకు వేసిన స్పెషల్ ట్రైన్లు అన్ని గురువారం రద్దీగా మారాయి. అదేవిధంగా జిల్లా మీదుగా ఇతర రాష్ట్రాలకు వెళ్లే రైళ్లు కూడా ప్రయాణికులతో కిక్కిరిశాయి.



ఆనందం ఆవిరి!

పండుగకు వచ్చి.. ప్రమాదానికి గురై ఇద్దరి మృతి



- 7లో

చిన్నతప్పు పెద్ద ప్రమాదానికి దారితీస్తుంది.. క్షణంలో ప్రాణాలు తీసేస్తుంది.. డ్రైవర్ అతివేగం ఇద్దరి ప్రాణాలు బలిగొంది.. అప్పటివరకూ ఆనందంగా గడిపిన క్షణాల్లో విషాదం నింపింది.. ఎక్కడెక్కడి నుంచో సంక్రాంతి పండుగకు వచ్చారు. కాకినాడ జిల్లా తూరంగిలో పండుగ మూడు రోజులు తమ బంధువుల ఇంట ఆనందంగా గడిపారు.. సెలవులు ముగుస్తుండడంతో గురువారం ఉదయం 10:30 గంటలకు ప్రత్తిపాడు మండలంలోని ధారపల్లి జలపాతం వద్దకు 30 మంది టెంపో వ్యాన్‌లో విహారయాత్రకు బయలుదేరారు.. పండుగ ముచ్చట్లు చెప్పుకుంటూ ఆనందంగా ఉన్నారు.. వాహనం వేగంగా వెళుతోంది.. అంతలోనే ఒక్క కుదుపు.. వ్యాన్ కాస్తా ఒక కాలువలోకి బోల్తా పడింది.. ఏం జరిగిందో తెలియలేదు..అంతా తేరుకుని చూసేసరికి 28 మంది గాయాలతో బయటపడగా ఇద్దరు మహిళలు దుర్మరణం పాలయ్యారు. దీంతో విషాదయాత్రగా మారింది..

కాకినాడలో సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్

కలెక్టర్ షాన్‌మోహన్



జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న శ్రీనివాస్‌కుమార్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణకు కాకినాడ ప్రాతినిధ్యం వహించడం గొప్ప శుభ పరిణామం అని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్‌క్లబ్, ట్రస్ట్ ఫౌండర్, ఆదాయ పన్ను అధికారి రవిచంద్ర, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌కుమార్‌లు కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ కాకినాడ వేదికగా జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ టోర్నమెంట్ రానున్న ఫిబ్రవరి నెల 15వ తేదీ నుంచి 28 వరకు కాకినాడ క్రీడ ప్రాధికార సంస్థ మైదానం ఆస్ట్రోటర్ఫ్ హాకీ ఫీల్డ్‌లో జరుగుతుందన్నారు. కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్‌క్లబ్, జిల్లా హాకీ అసోసియేషన్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సక్రమంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో కాకినాడలో అంతర్జాతీయ టోర్నమెంట్లు నిర్వహించేందుకు అన్నివిధాల కృషి చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.



బాధ్యతలు చేపడుతున్న మనీష్ దేవరాజ్ పాటిల్

ఎస్‌డీపీవోగా బాధ్యతలు చేపట్టిన మనీష్ దేవరాజ్

కాకినాడ క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎస్‌డీపీవోగా ఐపీఎస్ అధికారి మనీష్ దేవరాజ్ పాటిల్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన రఘువీర్ విష్ణును హెడ్ క్వార్టర్‌కు రిపోర్ట్ చేయాల్సిందిగా డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. మహారాష్ట్రకు చెందిన మనీష్ దేవరాజ్ పాటిల్ 2022 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందినవారు. ఆయన తొలుత విశాఖపట్నం గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా పనిచేశారు. ప్రస్తుతం జరిగిన బదిలీల్లో భాగంగా ఆయనను కాకినాడ ఎస్‌డీపీవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం కాకినాడ సబ్ డివిజన్ వ్యాప్తంగా ఉన్న పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల అదుపునకు అధిక ప్రాధాన్యతను ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



కలెక్టరేట్(కాకినాడ), జనవరి 16(ఆంధ్రజ్యోతి):మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం క్యాలెండర్, డైరీని కలెక్టర్ షాన్‌మోహన్ ఆవిష్కరించారు. జిల్లానీటి యజమాన్య సంస్థ కార్యాలయం పరిధిలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సహాయ పథక సంచాలకులు ఈ సంఘంలో సభ్యులు. డ్వామా పీడీ వెంకటలక్ష్మి, ఏవో అబ్రహం లింకన్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్, జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, మహాలక్ష్మి పాల్గొన్నారు.

హత్య జరిగిందంటే.. ఆధారాలు లభించకపోయినా పోలీసులు వేగంగా దర్యాప్తు చేస్తారు.. కనిపెట్టేస్తారు.. హంతకుడిని కటకటాల్లోని నెట్టేస్తారు.. అయితే గంజాయి ఎలా వస్తుందో ఎక్కడి నుంచి వస్తుందో పోలీసులందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే.. అయినా అరికట్టలేకపోతున్నారు..

రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, కొవ్వూరు, నిడదవోలు వంటి ప్రధాన పట్టణాల్లోనూ గంజాయి ఎక్కడ లభిస్తుందనేది బహిరంగ రహస్యం.. అయినా దాడులు మాత్రం అంతంత మాత్రమే.. అవసరమైన సమయంలో మాత్రమే దాడులు చేస్తారు... కేసులు నమోదు చేస్తారు. ఎందుకంటే కేసులకూ ఒక లెక్క ఉంటుంది మరి..

ఈసారి సంక్రాంతి పండుగలో మందు.. సారాతోపాటు మరొకటి చేర్చారు.. అదే గంజాయి.. ఎప్పటి నుంచో గంజాయి వినియోగం ఉన్నా ఈ ఏడాది మాత్రం విచ్చలవిడిగా మారింది.. కోడి పందాల బరుల వద్ద గంజాయి విక్రయాలు సాగాయి. అయినా ఏ ఒక్కరూ అటు వైపు చూసిన దాఖలాలు లేవు. అసలు గంజాయి ఎలా రవాణా జరుగుతుందంటే పోలీసులు మాకేం తెలుసు అంటారు.. బయట జనాలకే తెలిసింది.. రక్షణాధికారులకు తెలియకపోవడం విడ్డూరమే కదా మరి.. ఇటీవల కూటమి ప్రభుత్వం ఈగల్ టీమ్‌లను నియమించింది.. ఆ టీమ్ ఎంతవరకూ అరికడుతుందో చూడాల్సిందే..





గంజా.. ఏదీ పంజా!

తూర్పును కమ్మేస్తున్న గంజాయి పొగ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రశాంతమైన 'తూర్పు'ను గంజాయి పొగ కమ్మేస్తోంది. యువత ఆ మత్తులో జోగుతూ రెచ్చిపోతోంది. రాత్రివేళ మరీ పేట్రేగిపోతోంది. రాజమహేంద్రవరం, కాకినాడ నగరాలతో సహా నిడదవోలు, కొవ్వూరు, అమలాపురం వంటి పట్టణాల్లో గంజాయి వినియోగం విజృంభిస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు గంజాయిని అరికట్టాలని పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారు. గంజాయి నిర్మూలించండి మహాప్రభో అంటూ రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఎస్పీకి విన్నవించారంటే పరిస్థితి ఎంత చేయిదాటిందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా రాజమహేంద్రవరం, రాజానగరం, నిడదవోలు తదితర ప్రాంతాల్లో గంజాయి పట్టుబడడమే దీనికో ఉదాహరణ. ఈ ఏడాది సంక్రాంతి పండుగలో కోడి పందాల బరుల వద్ద విచ్చలవిడిగా గంజాయి విక్రయాలూ సాగాయి. గతంలో ఎన్నడూ ఇలా సంక్రాంతి సమయంలో గంజాయి విక్రయాలు జరిగిన సందర్భాలు లేవు. ఇప్పటికే చాపకింద నీరులా ఆవహిస్తున్న గంజాయి మరింత బలంగా పాతుకుపోయే పరిస్థితి కానరావడం ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో గంజాయి సరుకు గ్రామాల్లోనూ అందుబాటులో ఉండడంపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

నిద్దరోతున్న నిఘా వ్యవస్థ

ఉమ్మడి తూర్పుగోదావరిలో గంజాయిపై ఉక్కుపాదం మాటలా ఉంచితే, కొంతకాలంగా సోదాలు కానరావడం లేదు. హైవే పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్లు వాహన తనిఖీలు వదిలేశాయి. ఎక్కడో మారుమూల ఏజెన్సీలో సాగు చేస్తున్న గంజాయి నగరాలకు రావడం పరిపాటిగా మారింది. గ్రామాల్లోనూ గం'జాయ్' పొగ దట్టంగా మారింది. సుమారు గ్రాము గంజాయిని రూ.500కి విక్రయిస్తున్నారు. ప్రధానంగా నగరాల్లో పరిసర గ్రామాలకు చేరుకుంటున్న గంజాయి.. అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు సరఫరా అవుతోంది. ఇంత జరుగుతున్నా పోలీస్ నిఘా (ఎస్‌బీ)కు ఎందుకు వాసన రావడం లేదనే ప్రశ్న చాలామందిలో ఉత్పన్నమవుతోంది.



గంజాయి వస్తుందిలా..

ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని మంచంగిపుట్ట, పాడేరు, అరకు, చింతపల్లి, పెదబయలు, జి.మాడుగుల, హుకుంపేట, సీలేరు తది తర మండలాల్లోని దాదాపు 50 పంచాయతీల పరిధిలో 200 వరకూ గ్రామాల్లో సాగుచేస్తున్న గంజాయి 25 వేల ఎకరాల పైమాటే. మన్యంలో రూ.2 వేల కోట్ల వరకూ ఏడాదికి వ్యాపారం జరుగుతుందని అంచనా. గ్రామాల్లో కిలో రూ.2 వేల నుంచి ప్రారంభమవుతుంది. నాణ్యతను బట్టి రేటు ఉంటుంది. పాడేరు, చింతపల్లిలో రూ.5 వేలు, నర్సీపట్నంలో రూ.10 వేలు పలుతోంది. చింతపల్లి నర్సీపట్నం, తుని గుండా హైవేకు.. నర్సీపట్నం, కాకరపాడు, రాజవొమ్మంగి, ఏలేశ్వరం, ఎర్రవరం దగ్గర హైవేకు అక్కడి నుంచి రాజానగరం మీదుగా రాజమండ్రికి.. ఇటు సీలేరు, డొంకరాయి, చింతూరు, మారేడుమిల్లి, రంపచోడవరం, రాజమండ్రికి ఏడాది పొడవునా సరఫరా జరుగుతుంది. చెన్నై, ఢిల్లీ, రాజస్థాన్, కర్నాటక, ఒడిశా వంటి ప్రాంతాలకు చేరిస్తే కిలోకి రూ.50 వేలు, హైదరాబాద్‌లో అప్పగిస్తే రూ.25 వేలుకిస్తారు.

గత ఐదేళ్లలో ఇదీ తీరు..

ఇక వైసీపీ ప్రభుత్వంలోనే గంజాయి విశృంఖలమైంది. ఉమ్మడి జిల్లాలో 2019లో 27 కేసులు నమోదుకాగా, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో 29, 2021లో 48, 2022లో ఏకంగా 84, 2023లో 69 కేసులు నమోదయ్యాయి. 2024లో 75 కేసులు పెట్టారు. ఐదేళ్లలో గంజాయి వినియోగించేవాళ్లు 209, విక్రయదారులు 483, సరఫరాదారులు 623 మంది కలిపి మొత్తం 1315పై కేసులు నమోదుచేయగా, 1116 మందిని అరెస్టు చేశారు. ఇంకా 199 మందిని అరెస్టు చేయాల్సి ఉంది. వీళ్లలో 2019లో కేసులు నమోదైనవాళ్లు 19 మంది ఉన్నారు. 2019 నుంచి 2024 నవంబరు వరకు 27,137 కిలోల గంజాయి, 212 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నేర నిరూపణ కాక ఇద్దరు విడుదలయ్యారు. ఒక్కరికీ శిక్ష పడలేదు. 133 మంది నిందితులను అసలు గుర్తించలేక పోయారు. జైలులో గంజాయి కేసుల్లో మగ్గుతున్న వారిలో అత్యధికం గిరిపుత్రులే. ఒక్క సెంట్రల్ జైలులోనే 600 మంది దాకా గంజాయి కేసులపై నిందితులే ఉంటారు.

- విచ్చలవిడిగా రవాణా
- రైలులో యువతతో తరలింపు
- బ్యాక్ బ్యాగ్‌లలో గంజాయి
- ఏజెన్సీ టూ హైదరాబాద్
- పండగలో భారీ వినియోగం
- బరుల వద్ద విక్రయాలు
- పల్లెలకూ పాకిన వైనం
- కన్నెత్తిచూడని నిఘా శాఖ
- అడపాదడపా మాత్రమే కేసులు
- రెచ్చిపోతున్న మాఫియా

'ఈగల్'తో సాధ్యమేనా!

గంజాయి తదితర నిషేధిత మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఎలైట్ యాంటీ-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈఏజీఎల్‌ఈ-ఈగల్)ని ఏర్పాటుచేసింది. దీనికి సమర్థవంతమైన అధికారిగా పేరున్న ఆకే రవికృష్ణను ఐజీగా నియమించడంతోపాటు 1972 టోల్‌ఫ్రీ నెంబరును ఏర్పాటు చేసింది. ఒకే ఈగల్ పోలీస్ స్టేషను ఉన్నప్పటికీ రాష్ట్రమంతా దీని పరిధిలోకి వస్తుంది. ప్రతి జిల్లాలోనూ ఈగల్ టీం ఉంటుంది. రాజమహేంద్రవరంలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయనున్నారు. ఈగల్ విధివిధానాలపై ఇటీవలే హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ గంజాయి పొగ పోలీసులకు తెలియకుండా ఉంటుందా?... అయినా ఇప్పుడు ఈగల్ టీమ్‌కి స్థానిక పోలీసులు ఎంతవరకూ సహకరిస్తారనే అనుమానాలు ఉన్నాయి. ఒకవేళ ఆ టీమ్‌లో స్థానిక పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది ఉంటే ఉద్దేశం నీరుగారక తప్పదనే విమర్శలు వినవస్తున్నాయి.

స్టూడెంట్ల ముసుగులో..

హైవేల గుండా వాహనాల్లో దూర ప్రాంతాలకు చేరుతుంటే.. రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని, అన్నవరం రైల్వే స్టేషన్ల గుండా విజయవాడ, హైదరాబాద్‌లోని పబ్‌లకు వారానికి నాలుగైదుసార్లు గంజాయి రవాణా జరుగుతున్నట్టు సమాచారం. దీనికి స్టూడెంట్ల మాదిరిగా కనిపించే కుర్రాళ్లను ఎంచుకుంటున్నారు. వాళ్ల వీపునకు తగిలించుకొనే బ్యాక్ ప్యాక్ బ్యాగులో కింద అర మాదిరిగా ఏర్పాటు చేస్తారు. సెల్‌ఫోన్ బాక్సుల్లో గంజాయి పెట్టి ఆ అరల్లో ఉంచుతున్నారు. ఈ వ్యక్తులు రైలు వచ్చే సమయానికంటే ముందే రైల్వే స్టేషనుకు చేరుకుంటారు. స్టూడెంట్ల మాదిరిగా తచ్చాడుతూ రైలు వచ్చే ప్లాట్‌ఫామ్‌కి అవతల వైపున.. అంటే ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్‌కి రైలు వస్తుందంటే రెండో నెంబరు ప్లాట్‌ఫాంపై తిరుగుతుంటారు. రైలు ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంకి చేరుకునే సమయంలో అటువైపు నుంచి బోగీలోకి ప్రవేశిస్తారు. కొందరికి రిజర్వేషన్లు ఉంటే.. మరికొందరు జనరల్ బోగీల్లో వెళుతున్నారు. బోగీలో కూడా వీళ్లు ఒకచోట కూర్చుని బ్యాగును మరో చోట పెడతారు. ఇలా చేరిస్తే రవాణా చార్జీలు కాకుండా రూ.3-5 వేలు గిట్టుబాటవుతుందని చెబుతున్నారు. రైళ్లలో తనిఖీలు నెమ్మదించడంతో గంజాయి రవాణా మరీ సులభంగా సాగిపోతోందని తెలుస్తోంది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉన్న పబ్‌కి రాజమండ్రి రైల్వే స్టేషను నుంచే గంజాయి సరఫరా అవుతుండడం ఒక ఉదాహరణ మాత్రమే. ట్రావెల్స్ బస్సుల్లోనూ గంజాయి తరలిస్తున్నారు.

పండుగ ఆనందం.. ఆవిరి

- ధారపల్లి జలపాతం సందర్శనకు వెళ్తుండగా ఘోర ప్రమాదం
- ఒమ్మంగి వద్ద పంటకాలువలోకి బోల్తా పడిన టెంపో వ్యాన్
- ఇద్దరు మహిళలు మృతి, 28 మందికి గాయాలు



మృతిచెందిన కోమాకుల చంద్రావతి, బత్తుల లక్ష్మిసురేఖ



క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం



ప్రమాదంపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఆంధ్ర, తెలంగాణకు చెందిన వివిధ ప్రాంతాల బంధువులు కాకినాడలోని తూరంగిలో బంధువుల ఇంటికి సంక్రాంతి సంబరాలకు వచ్చారు. 3 రోజులు కాకినాడలో ఉండి సంతోషంగా గడిపారు. నాల్గో రోజు ముక్కనుమ నాడు ధారపల్లి జలపాతం చూసేందుకు బయల్దేరి ప్రమాదం బారినపడ్డారు. వారు ప్రయాణిస్తున్న టెంపో వ్యాన్ గురువారం కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి ఆర్అండ్‌బీ రహదారి వద్ద పంట కాలువలోకి బోల్తా పడడంతో ఇద్దరు మహిళలు మృతిచెందగా 28 మంది గాయాల పాలయ్యారు. దీంతో అప్పటివరకూ ఆనందంగా గడిపినవారిలో తీవ్ర విషాదం నెలకొంది.

అతి వేగమే కారణమా..!

ఈ ప్రమాదానికి అతి వేగమే కారణంగా చెబుతున్నారు. వ్యాన్ డ్రైవర్ జి.రాంబాబు వేగంగా వాహనాన్ని నడపడాన్ని వారించినా వినలేదు. వేగం తగ్గించకుండా వెళ్లి ఒమ్మంగి గోపాలపురం చెరువు వద్ద వాహనాన్ని అదుపుచేయలేక రోడ్డు పక్కన ఉన్న చెట్టు దుంగను ఢీకొట్టాడు. దీంతో పంట పొలంలోకి వ్యాన్ బోల్తా పడిందని బస్సులో ప్రయాణించినవారు వాపోయారు.

ప్రత్తిపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ తూరంగికి చెందిన కోమాకుల శ్రీనివాసరావు తోడల్లుళ్ల కుటుంబాలు విశాఖపట్నం, మిరియాలగూడ, హైదరాబాద్ నుంచి తూరంగికి వచ్చారు. సంక్రాంతిని పురస్కరించుకుని భోగి, పెద్ద పండుగ, కనుమ మూడు రోజులు సందడిగా గడిపారు. నాల్గోరోజు ముక్కనుమ అయిన గురువారం ప్రత్తిపాడు మండలంలోని పర్యాటక ప్రదేశం అయిన ధారపల్లి జలపాతం చూడటానికి సన్నద్ధమయ్యారు. వారంతా కాకినాడలోని వినాయక ట్రావెల్స్‌కు చెందిన టెంపో వాహనాన్ని బుక్ చేసుకుని ఎంఎస్ఎన్ చార్టీస్ వద్ద నుంచి వ్యాన్ డ్రైవర్‌తో సహా 30 మంది బయల్దేరారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన వారి టెంపో వాహనం ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి సమీపంలోని గోపాలుడు చెరువు దగ్గరలో చీకటి తోటకు వద్దకు చేరుకోగానే ఉత్తరకంచి ఆర్అండ్‌బీ రహదారిపై వాహనం రోడ్డు పక్కన ఉన్న చెట్టు దుంగను వేగంగా వచ్చి ఢీకొంది. పంట కాలువలో టెంపో వ్యాన్ బోల్తా పడింది. దీంతో తూరంగికి చెందిన కోమాకుల శ్రీనివాసరావు భార్య చంద్రావతి (45), తిమ్మాపురానికి చెందిన బత్తుల సత్యనారాయణ కుమార్తె బత్తుల లక్ష్మిసురేఖ (19) సంఘటనా స్థలం వద్ద తలలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. అలాగే మరో 28 మంది గాయపడగా వారిలో 15మందికి తీవ్ర గాయాలు, 13 మందికి స్వల్ప గాయాలయ్యాయి.

కన్నీరు మున్నీరైన బంధువులు

టెంపో వ్యాన్ బోల్తా ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మహిళల బంధువుల రోదనతో ప్రత్తిపాడు ఆసుపత్రి నిండిపోయింది. ఈ సంఘటనలో మృతిచెందిన చంద్రావతికి భర్త కోమాకుల శ్రీనివాసరావు, ముగ్గురు సంతానం ఉన్నారు.

మృతిచెందిన మరో యువతి బత్తుల లక్ష్మి సురేఖకు తండ్రి సత్యనారాయణ, తల్లి లక్ష్మి ఉండగా ఈ అమ్మాయి కాకినాడ పీఆర్ డిగ్రీ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదుతుంది. బంధువులతో సరదాగా ధారపల్లి జలపాతం చూసేందుకు వెళ్లిన వారు టెంపో వ్యాన్ బోల్తా ఘటనలో ప్రాణాలు కోల్పోవడాన్ని వారి కుటుంబీకులు జీర్ణించుకోలేకపోతున్నారు. తమ కుటుంబీకులంతా ధారపల్లి జలపాతం వద్ద సేద తీరి సంతోషంగా గడుపుదామనుకుంటే విధి వంచించి ఇలా ప్రమాద బారిన పడాల్సివచ్చిందని ఆవేదన చెందుతున్నారు. విద్యార్థిని లక్ష్మీసురేఖ మృతితో తాపీ మేస్త్రీ పనులు చేసే ఆమె తండ్రి సత్యనారాయణ, తల్లి లక్ష్మీ తమ బిడ్డ ఉన్నత విద్యావంతురాలు అవుతుందని ఆశపడ్డామని అర్ధాంతరంగా మృత్యువు కబళించిందని కన్నీరుమున్నీరయ్యారు. తీవ్ర గాయాలకు గురైన వారిలో హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తమ్మిశెట్టి సోమశేఖర్, ఆయన భార్య శివకుమారి, కుమార్తె హిమాంసీలు ఉన్నారు.



ప్రత్తిపాడు ప్రభుతాసుపత్రిలో చికిత్స పొంతున్న క్షతగాత్రులు

ప్రాణాలు కాపాడిన యువకులు

పంట కాలువలో టెంపో వ్యాన్ బోల్తా పడిన సంఘటనలో టెంపో వెనుక బైక్‌పై వస్తున్న పెద్దిపాలెం యువకులు పండు, రాజు, గోవిందు చూసి క్షణాల్లో వ్యాన్ బోల్తాపడిన వారిని బయటకు తీసి అంబులెన్స్‌కు, పోలీసులకు వెనువెంటనే సమాచారం అందించారు. దీంతో సీఐ సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను సకాలంలో ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు.



పలువురి ప్రాణాలు కాపాడిన పెద్దిపాలెం యవకులు

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి : ఎమ్మెల్యే సత్యప్రభ

టెంపో వ్యాన్ బోల్తా ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఎమ్మెల్యే ఆసుపత్రిని సందర్శించి మృతుల బంధువులు, క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులకు ధైర్యం చెప్పారు. మృతుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు అండగా ఉండాలని కూటమి శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్యను ఆదేశించారు. జరిగిన రోడ్డుప్రమాదంపై సీఐ సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతంతో చర్చించారు. ఒమ్మంగి చీకటి తోట మలుపు వద్ద ప్రమాదాలు నివారణకు స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధిత శాఖల అధికారులకు తెలియజేయాలని సీఐ, ఎస్‌లను ఆదేశించారు. ప్రత్తిపాడు తహశీల్దార్ ఎం.సూర్యప్రభ, ఆర్ఐ గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ యాళ్ళ విశ్వేశ్వరరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యు డు వెలుగుల కొండలరావు, టీడీపీ నాయకులు అంబటి రాంబాబు, శెట్టి బత్తులవీరబాబు బాధితులను పరామర్శించారు.

తూరంగిలో విషాదఛాయలు

కాకినాడ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): టెంపో వ్యాన్ బోల్తా ప్రమాదంలో కాకినాడ రూరల్ మండలం తూరంగికి చెందిన కోమాకుల చంద్రావతి(45) మృతిచెందింది. ఆమె భర్త శ్రీనివాస్‌కు, ముగ్గురు కూతుర్లు వరలక్ష్మి, అంజలి, శిరీషలకు తీవ్రమైన గాయాలు కావడంతో ప్రత్తిపాడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనతో తూరంగిలో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. వారంతా సంక్రాంతి పండుగను ఎంతో ఆనందంగా చేసుకుని విహార యాత్రకు బయలుదేరితే ప్రమాదం జరగడంతో తూరంగివాసులు ఆవేదన చెందుతున్నారు. చంద్రావతి మృతదేహాన్ని శుక్రవారం తూరంగిలోని వారి నివాసానికి తీసుకువస్తారని సమాచారం.

రోడ్డు ప్రమాదాల నివారణపై ఆర్టీసీ ప్రత్యేక దృష్టి

డ్రైవర్లకు పీరియాడికల్ మెడికల్ టెస్టులు : ఆర్టీసీ ఈడీ విజయరత్నం



అమలాపురం ఆర్టీసీ డిపోలో మొక్కలు నాటిన ఆర్టీసీ ఈడీ విజయరత్నం

అమలాపురం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణపై ఆర్టీసీ సంస్థ ప్రధానంగా దృష్టి సారించినట్టు జోన్-2 విజయవాడ నూతన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వి జయరత్నం తెలిపారు. జిరో యాక్సిడెంట్ రేట్ సాధించే దిశగా పలుచర్యలు ఇప్పటికే చేపట్టామన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని కోనసీమ జిల్లా అమలాపురం ఆర్టీసీ డిపోలో గురువారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవర్లు అప్రమత్తంగా తమ విధులు నిర్వర్తించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టే దిశగా డ్రైవర్లకు పీరియాడికల్ మెడికల్ టెస్టులు, నూతన బస్సుల టెక్నాలజీపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీనెల డ్రైవర్లకు విజయవాడ జోనల్ కార్యాలయంలో అవగాహన సదస్సులు, కౌన్సిలింగ్ విధానం అమలు చేస్తున్నామన్నారు. జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఆయన మొక్కలు నాటారు. రహదారి భద్రతా మాసోత్సవాలను ప్రారంభించారు. డిపోలో మెరుగైన మెయింటినెన్స్ నిర్వహిస్తూ బస్సుల కండీషన్‌ను ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకుంటున్నందుకు డిపో సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లకు, ఉత్తమ కండక్టర్లకు, గ్యారేజీ సిబ్బందికి ఈడీ విజయరత్నం ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లా ప్రజా రవాణాధికారి మాట్లాడుతూ అమలాపురం డిపోకు 25 కొత్త బీఎస్-6 వాహనాలు వచ్చాయని, వాటి వల్ల ప్రయాణికులకు మరింత మెరుగైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తున్నామన్నారు. డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి, సిబ్బంది, సూపర్‌వైజర్లు, వివిధ అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయస్థాయి చెస్ పోటీలు

- ఐదు రోజులపాటు పెద్దాపురం శ్రీప్రకాష్ పాఠశాలలో నిర్వహణ
- 28 రాష్ట్రాల నుంచి 1239 మంది క్రీడాకారులు హాజరు
- ఏర్పాట్లు పరిశీలించిన కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

పెద్దాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలోని శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో ఈనెల 17వ తేదీ నుంచి 21 వరకూ ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 13వ నేషనల్ స్కూల్స్ జాతీయ స్థాయి చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. దీనిలో భాగంగా ఆయన చెస్ పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను జేసీ రాహుల్ మీనాతో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 5 రోజుల పాటు జరగనున్న పోటీల్లో దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలకు చెందిన సుమారు 1239 మంది క్రీడాకారులు పాల్గొంటారని, అలాగే 560 మంది రేటెడ్ క్రీడాకారులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. 12 విభాగాల్లో ఈ పోటీలు జరగనున్నాయని తెలిపారు. క్రీడాకారులకు కల్పించనున్న భోజన వసతి, సౌకర్యాలు తదితర విషయాలపై స్థానిక అధికారులతో చర్చించారు. ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి, జిల్లా ప్రాధికార సంస్థ అభివృద్ధి అధికారి శ్రీనివాస కుమార్, శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాల డైరెక్టర్ సీహెచ్.విజయ్ ప్రకాష్, చీఫ్ ఆర్బీటర్ పాల్ ఆరోఖ్యరాజ్, చెస్ అసోసియేషన్ చైర్మన్, కార్యదర్శి కేవీవీ శర్మ, సురేష్, కార్య నిర్వాహణాధికారి ఫణి, రాజాసూరిబాబురాజు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు



పరుగు పందాన్ని పరిశీలిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ

కాకినాడ క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా పురుష అభ్యర్థులకు కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో దేహదారుఢ్య పరీక్షలు గురువారం 11వ రోజుకు చేరాయి. మొత్తం 657మంది హాజరుకాగా తదుపరి పరీక్షకు 377 మంది అర్హత సాధించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించారు. కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, అడ్మిన్ ఎస్పీ ఎంజెవి భాస్కర్‌రావ్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్‌రావు పర్యవేక్షించారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి ఏడాది జైలు

కడియం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పోలీసు విధులకు ఆటంకం కలిగించారన్న కేసులో అరెస్టయిన వ్యక్తికి ఏడాది జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం ప్రిన్సిపాల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి బాషా తీర్పునిచ్చారు. సీఐ ఎ.వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. వీరవరంలో 2022లో దుర్గాదేవీ తీర్థం జరిగింది. ఆ సమయంలో రాజమహేంద్రవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్(లా అండ్ ఆర్డర్) హెడ్ కానిస్టేబుల్ పి.బుజ్జిబాబు బందోబస్తు డ్యూటీలో ఉన్నారు. పొట్టిలంక గ్రామానికి చెందిన డేగల వరప్రసాద్ బుజ్జిబాబు విధులకు ఆటంకం కలిగించడంతో పాటు తీవ్రంగా గాయపరిచాడు. దీంతో టూటౌన్ హెచ్‌సీ పీఏ ప్రసాద్ ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ పీవీజీ తిలక్ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదనల అనంతరం నేరం రుజువుకావడంతో ప్రసాద్‌కు న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారు. ఈ కేసులో ఏపీపీ పీవీవీఎస్‌బీ రాజు వాదనలు వినిపించగా అప్పటి కోర్టు హెడ్‌కానిస్టేబుల్ కె.శ్రీనివాస్, కానిస్టేబుల్ కె.శ్రీనివాస్ సహకరించారు.

టాలెంట్ టెస్ట్‌లో 'షిర్డిసాయి'కి ర్యాంకులు

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఏఎస్ రావు సైన్సు టాలెంట్ టెస్ట్‌లో రాజమహేంద్రవరంలోని తమ విద్యార్థులు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని షిర్డిసాయి విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య తెలిపారు. తమ లక్ష్యా ప్రోగ్రాంలో పదో తరగతి చదువుతున్న ఐ.కశ్యప్ వంశీ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, వి.పూజేంద్ర ద్వితీయస్థానాన్ని సాధించారన్నారు. మొత్తం 8 మంది విద్యార్థులు 20లోపు ర్యాంకులు సాధించారని, ఫిబ్రవరి 9న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో నిర్వాహకులు విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారన్నారు. విద్యార్థులను శ్రీవిద్యతో పాటు విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, లక్ష్యా డీన్ కె.శ్రీనివాస్ అభినందించారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య

రూ.20 లక్షలతో ముసలమ్మ తల్లికి టేకు రథం



కాశీ, అమ్మిరాజు సోదరులను సత్కరిస్తున్న మంత్రి దుర్గేష్



అమ్మవారికి బహూకరించిన టేకురథం

కడియం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియపులంక గ్రామదేవత పుంతలో ముసలమ్మ అమ్మవారికి విశ్వేశ్వర హైటెక్ నర్సరీ వ్యవస్థాపకుడు నక్కా రామ్మూర్తి-నాగత్రివేణి దంపతుల కుమారులు నక్కా కాశీవిశ్వేశ్వరరావు-రామలక్ష్మి, నక్కా అమ్మిరాజు-రత్నకుమారి దంపతులు సుమారు రూ.20 లక్షల విలువైన 13 అడుగుల టేకు రథాన్ని బహూకరించారు. ఈ రథాన్ని తమ నర్సరీ వద్ద 5 నెలల పాటు అనుభవజ్ఞులైన శిల్పులతో తయారు చేయించినట్టు కాశీవిశ్వేశ్వరరావు సోదరులు తెలిపారు. గురువారం ముసలమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ప్రజాప్రతినిధుల సమక్షంలో రథాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. గ్రామ దేవతకు విలువైన రథాన్ని ఇవ్వడం అభినందనీయమని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా కాశీ, అమ్మిరాజు సోదరులను భారీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో గట్టి నర్సయ్య, వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, పంతం గణపతి, ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, బొరుసు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టులకు విరివిగా విరాళాలు

దాత రామకృష్ణకు ఘన సత్కారం



గుత్తిన దీవిలో దాత రామకృష్ణను సత్కరిస్తున్న గ్రామస్థులు

ఐ.పోలవరం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో నిర్వహించే అన్నదాన ట్రస్టులకు విరివిగా విరాళాలు అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం గుత్తినదీవి గ్రామానికి చెందిన కంతేటి రామకృష్ణ. ఆయన అన్నవరం దేవస్థానం అన్నదాన ట్రస్టుకు, అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి అన్నదాన ట్రస్టుకు, అప్పనపల్లి వేంకటేశ్వర స్వామివారి అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష వంతున అందించారు. అమలాపురం రూరల్ మండలం వేమవరంలో శ్రీవల్లిదేవసేనసమేత సుబ్రహ్మణ్య స్వామివారికి రూ.లక్ష, గుత్తినదివిలో ఉన్న ఆర్యవైశ్య సంఘానికి రూ.3లక్షలు విరాళం అందించి ఉదారతను చాటుకున్నారు. ఈ మేరకు స్థానికులు దాత రామకృష్ణను గురువారం గ్రామంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెల్లు గంగాధరం, ఆకుల సత్తిబాబు, సలాది శ్రీనివాసరావు, కంతేటి కుమార్ పాల్గొన్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఎంపికైనవారికి నెలకు రూ.5వేలు వంతున అందజేత

పిఠాపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): యువత ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకుగానూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు నైపుణ్యపరమైన శిక్షణతో కూడిన విద్యను, 12నెలల పారిశ్రామిక అనుభవాన్ని అందిస్తారని, 20కంటే ఎక్కువ రంగాల్లో శిక్షణకు అవకాశంఉందని తెలిపారు. శిక్షణ పొందే విద్యార్థులు ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లొమా, బీఏ, బీకామ్, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీఫార్మ్ వంటి డిగ్రీలు ఉండాలని చెప్పారు. ఆన్‌లైన్, దూర విద్య ప్రోగ్రామ్‌ల్లో నమోదు చేసుకున్నవారు అర్హులని, 21-24 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. శిక్షణ పొందేవారికి ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజనా, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనా పథకాల ద్వారా బీమా కవరేజీ ఉంటుందని చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.5వేలు వంతున 12 నెలలు పాటు అందిస్తారని, అదే సమయంలో ఏకకాల గ్రాంటుగా రూ.6వేలు అందిస్తారని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 21 ఆఖరి తేది అని చెప్పారు. ఈ ఇంటర్న్‌షిప్ కోసం **https://pminternship.mca.gov.in/** వెబ్‌సైట్ ద్వారా ఆధార్, బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 9966291339లో సంప్రదించాలన్నారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు



పోటీలో తలపడుతున్న పురుష జట్లు

రామచంద్రపురం (ద్రాక్షారామ), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజుపంతులు క్రీడా ప్రాంగణంలో 14వ ఆలిండియా, 20వ ఆంధ్ర ప్రదేశ్ బాస్కెట్‌బాల్ టోర్నమెంటులో భాగంగా గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్ పోటీల్లో మెన్స్ అండ్ ఉమెన్స్ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ప్రీక్వార్టర్స్ నుంచి క్వార్టర్స్ ఫైనల్స్‌వరకు జట్ల మధ్య పోరు ఉత్కంఠ భరితంగా సాగింది. పురుషులు, మహిళ జట్ల మధ్య పోటీలను జరిగాయి.

సెమీస్‌కు చేరిన జట్లు

మహిళల విభాగంలో ఎస్ఆర్ఎం చెన్నై, పటేల్ అకాడమీ చత్తీస్‌ఘడ్, రామచంద్రపురం, సెంట్రల్ హైదరాబాద్ జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి. పురుషుల విభాగంలో క్వార్టర్స్ ఫైనల్ మ్యాచ్‌లో సీఆర్‌పీఎస్ చండీఘర్, బిలాస్‌స్టీల్ చత్తీస్‌ఘడ్ జట్ల మధ్య జరిగిన పోరులో సీఆర్‌పీఎఫ్ చండీఘర్ గెలుపొంది సెమీస్‌కు చేరుకుంది. అదే విధంగా సెంట్రల్ టాక్స్ హైదరాబాద్, వైఎంజీ హైదరాబాద్ జట్ల మధ్య పోరులో సెంట్రల్ టాక్స్ గెలుపొంది సెమీస్‌కు చేరుకుంది. మరో క్వార్టర్స్‌లో రామచంద్రపురం, చిత్తూరు జట్లు, జి.మామిడాడ, డబ్ల్యుఈ హైదరాబాద్ జట్లు తలపడ్డాయి.



ఆడుతున్న మహిళల జట్లు


జాతీయ స్థాయి నాటిక పోటీలు ప్రారంభం



భోగాపురంలో పోటీలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కౌడా చైర్మన్ తుమ్మల బాబు

పిఠాపురం రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురం గ్రామంలో భోగాపురం కళాపరిషత్ తృతీయవార్షిక నాటక మహోత్సవంలో భాగంగా 4 రోజులు పాటు నిర్వహించే కొణిదెల పవన్‌కల్యాణ్ జాతీయ స్థాయి నాటిక పోటీలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ పోటీలను కౌడా చైర్మన్ తుమ్మల బాబు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటకరంగాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నేటికి పలు కళా పరిషత్‌లు నాటికలు, నాటకాల పోటీలు నిర్వహిస్తున్నాయని, వారికి ప్రభుత్వపరంగా తగిన సహకారం అందేలా కృషి చేస్తామని తెలిపారు. నాటక కళాకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. కార్యక్రమంలో భోగాపురం నాటక కళాపరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొంగలు.. కనువిందు



కోనసీమ జిల్లా అల్లవరం-రెల్లుగడ్డ రోడ్డులో దాళ్వా చేలల్లో కొంగలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

నేడు కాకినాడ రూరల్ సర్వసభ్య సమావేశం

సర్పవరం జంక్షన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం రమణయ్యపేట మండల కార్యాలయ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి ఎంపీపీ బందిలి వీరీష అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పసుపులేటి సతీష్ తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

బాధితులకు ప్రభుత్వపరంగా సహకారం

మాజీ ఎమ్మెల్యే వర్మ



గొల్లప్రోలులో జరిగిన అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ

గొల్లప్రోలు/పిఠాపురం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో సర్వసం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వపరంగా సహకారం అందించేందుకు కృషి చేస్తానని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. గొల్లప్రోలులో చెప్పుల గోడౌన్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో రూ.8లక్షల ఆస్తినష్టం జరిగిన ప్రాంతాన్ని ఆయన గురువారం పరిశీలించి ప్రమాదానికి కారణాలపై షాపు యజమాని గండే నాగేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన గంధం నాగేశ్వరరావును వర్మ పరామర్శించి రూ.5వేలు, పిఠాపురం మండలం చిత్రాడ ఈబీసీ కాలనీలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వసం కోల్పోయిన షేక్ సుభానికి రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వర్మ వెంట పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎంపీ సతీష్‌బాబును కలిసిన నేతలు



సతీష్‌బాబును కలిసి చంద్రబాబు విజన్ పుస్తకాన్ని అందజేస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : కాకినాడలోని క్యాంపు కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబును గురువారం పలువురు నేతలు కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాలకు చెందిన ప్రముఖులు ఆయనను కలిశారు. కాకినాడ సిటీ, రూరల్ నుంచి పలువురు టీడీపీ నాయకులు కలిసి శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు (బున్ని) తదితరులు ఉన్నారు.

సతీష్‌బాబుకు ఎమ్మెల్యే సత్కారం

కాకినాడ సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా మురముళ్లలో సంక్రాంతి సంబరాలకు హాజరైన రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబును ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు శాలువాతో సత్కరించారు.



మన గ్యాస్ మనకే దక్కాలని 1న కాకినాడలో సదస్సు

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధు

కాకినాడ సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సమీపాన సముద్ర గర్భంలో చమురు నిక్షేపాలు వెలికితీస్తున్న నేపథ్యంలో మన గ్యాస్ మనకే దక్కాలనే నినాదంతో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి ఫిబ్రవరి 1న కాకినాడలో సదస్సు నిర్వహించనున్నామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు వెల్లడించారు. గురువారం స్థానిక పీఆర్ భవన్‌లో సీపీఐ ఆధ్వర్యాన విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ అప్పుల్లో ఉన్న ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చెందేందుకు మన గ్యాస్ వాటాను అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఏకమై సాధించగలమన్నారు. కాకినాడకు 30 కిలోమీటర్ల దూరంలో సముద్ర గర్భం నుంచి గతేడాది జనవరి నుంచి ముడి చమురు ఉత్పత్తి ప్రారంభమైందన్నారు. కృష్ణా, గోదావరి బేసిన్‌లో గ్యాస్‌తో పాటు ఈ చమురు విలువ కొన్ని లక్షల కోట్లు ఉంటుందన్నారు. ఆంధ్ర తీరంలో ఉన్న చమురు నిక్షేపాలు దేశ ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్ని మార్చనున్నాయన్నారు. మన తీర ప్రాంతంలో చమురు ఉత్పత్తి ఆంధ్ర ప్రజల ఆర్థికాభివృద్ధికి చాలా కీలకమైందన్నారు. 1న నిర్వహించనున్న సదస్సుకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డేగ ప్రభాకర్, వివిధ రంగాల ప్రముఖులు హాజరుకానున్నారన్నారు. సదస్సులో పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, కార్మికులు, రైతులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని మధు పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, శాఖా రామకృష్ణ పాల్గొన్నారు.

సొంత భవనం ఎప్పుడు?

అద్దె భవనంలో సామర్లకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

క్రయవిక్రయదారులు ఇబ్బందులు

సామర్లకోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం సమకూరుస్తున్న సామర్లకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మూడున్నర దశాబ్దాల తరబడి అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారు. పురాతన కాలంనాటి పాతభవనం గత ముప్పై ఐదేళ్ల క్రితం (విద్యుత్ సబ్‌స్టేషన్‌వద్ద) శిథిలావస్థతో కూలిపోవడంతో అప్పటి ఏలూరు రేంజి డీఐజీ దశరథం ఆదేశాల మేరకు ఏడీబీ రోడ్డులో ఇంద్ర భవన్‌కు మార్చారు. సుమారు ముప్పై నాలుగేళ్ల పాటు ఇంద్రభవన్ అద్దె భవనంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిర్వహించగా అదీ కూడా శిథిలావస్థకు మారడంతో 10 నెలల క్రితం పట్టణానికి దూరంగా 2 కిలోమీటర్ల ఆవల గల మాజేటి నగర్‌కు చెందిన ఒక ప్రైవేట్ భవనంలోకి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్పుచేశారు. ప్రస్తుతం నిర్వమిస్తున్న ఈ కార్యాలయం దూరంగా ఉండడం, భద్రతాలేమి వంటి కారణాలతో క్రయవిక్రయదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఏడాదికి లక్షల్లో ఆదాయం సమకూరే సామర్లకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆదాయం ఇప్పుడు కోట్లకు పెరిగింది. గత నాలుగేళ్లుగా ఏడాదికి ఈ కార్యాలయంలో జరిగే భూములు, స్థలాలు, గృహాల రిజిస్ట్రేషన్ల ద్వారా ఏడాదికి రూ.3.5కోట్లకు పెరిగింది. అయినప్పటికీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు ఈ కార్యాలయానికి సొంత భవనం నిర్మాణం విషయంలో ఎటువంటి పురోగతి చర్యలు తీసుకోవడం లేదు. సామర్లకోటలో దాదాపు పలు శాఖల ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఉండగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మాత్రమే అద్దె భవనంలో ఉంది. విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి చెంది పాత స్థలం ఉంది. ఆ స్థలంలో నూతన భవనం నిర్మించేందుకు నిధుల అవసరం ఉంది. ప్రభుత్వపరంగా నూతన భవనం నిర్మించాల్సిన అవసరాన్ని ప్రభుత్వ ఉన్నతాధికారులే పరిశీలించుకోవాలని ప్రజాప్రతినిధులు భావిస్తుండగా అడ్మినిస్ట్రేటివ్ కార్యకాలాపాలు వదిలి నూతన భవనం కోసం మనమెందుకు ప్రయత్నించాలి అనే ధోరణిలో ఆ శాఖకు చెందిన అధికారులు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత గూడు ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.



అద్దె భవనంలో నిర్వహిస్తున్న సామర్లకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

నిధులు ఏమయ్యాయి!

సామర్లకోటలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే సుమారు రూ.50 లక్షల నిధులు విడుదల చేయడమే గాకుండా కొంత మేర సిమెంట్ సైతం ప్రభుత్వం కేటాయించినట్టు ఆ శాఖ వర్గాల ద్వారా తెలిసింది. ఆ నిధులు ఏమయ్యాయో నేటికీ గోప్యంగా ఉండడం చూస్తుంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంతభవనం నిర్మాణం కలేనా అనిపలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15వరకు జరగనున్న రోడ్డు ప్రమాదాల మాసోత్సవాలు గురువారం కాకినాడ డిపోలో ప్రారంభమయ్యాయి. కాకినాడ డిపో మేనేజర్ ఎంయువి మనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.హరినాథరెడ్డి హాజరయ్యారు. డ్రైవర్లు బస్సులు నడుపుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు అరికట్టేందుకు కావాల్సిన నైపుణ్యాలను వివరించారు. నెల రోజుల పాటు జరిగే కార్యక్రమాల షెడ్యూల్‌ను కాకినాడ ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు విడుదల చేశారు. ఈనెల 17 నుంచి 21 వరకు బస్సు కండీషన్ మెరుగుపరచడం, 22,23న ప్రమాద రహిత డ్రైవర్లకు సేఫ్టీ అలవెన్సు ఇవ్వడం, 24న డ్రైవర్స్‌డే, 25 నుంచి 28 వరకు రోడ్డు భద్రతపై డ్రైవర్లకు శిక్షణ, 29 నుంచి ఫిబ్రవరి 4వరకు వైద్య పరీక్షలు, 5, 6న ప్రమాదాలు చేసిన డ్రైవర్లకు కుటుంబంతో పాటు కౌన్సిలింగ్, 7 నుంచి 10వరకు రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన, 11, 12న బ్లడ్ క్యాంప్, 13, 14న రోడ్ సేఫ్టీపై ఆడిట్, 15న ముగింపు వేడుక, ఉత్తమ డ్రైవర్లకు బహుమతి ప్రదానం జరుగుతుందన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

పిఠాపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వర స్వామి దేవస్థానం నిత్యాన్నదాన ట్రస్ట్‌కు దేవాదాయశాఖ విశ్రాంత ఆర్‌జేసీ ముమ్మిడి రామకృష్ణ, లక్ష్మీ శారదాంబ దంపతులు రూ.50వేలు విరాళం ప్రకటించారు. కాకినాడకు చెందిన వీరు గురువారం పాదగయలో ఈ మొత్తాన్ని ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్‌కు అందజేశారు. ఏటా ఫిబ్రవరి 15న దేవిశెట్టి బ్రహ్మారాజు, నక్షత్రమ్మ పేరున అన్నదానం జరిపించాలని కోరారు. రామకృష్ణ దంపతులను ఈవో ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రసాదాలు, స్వామి,అమ్మవార్ల చిత్రపటం అందజేశారు.



పాదగయలో విరాళం అందజేస్తున్న విశ్రాంత ఆర్‌జేసీ రామకృష్ణ దంపతులు

9.5అంగుళాల పుంగనూరు దూడ జననం

కరప, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలం జడ్.బావారంలో కేవలం 9.5 అంగుళాల ఎత్తు ఉన్న పుంగనూరు పెయ్యదూడ జన్మించింది. గ్రామానికి చెందిన పాడిరైతు కంచెర్ల నాగేశ్వరరావు పశువుల మకాంలో కొండ ఆవుకు రెండో ఈతగా ఈ దూడ పుట్టింది. 28అంగుళాల పొడవు, 9.5అంగుళాల ఎత్తున్న ఈ దూడ చూపరులకు కనువిందు చేస్తుంది. దీన్ని చూసేందుకు గ్రామస్తులు వస్తున్నారు. ఇదే రైతుకు చెందిన దేశవాళీ ఆవుకు గత డిసెంబరు 25వ తేదీన ఒక పుంగూరు గిత్తదూడ, అక్టోబరులో కర్రిరంగు పుంగనూరు ఆవుకు గిత్తదూడలు పుట్టాయి.



9.5అంగుళాల పుంగనూరు పెయ్య దూడ

పవన్ ఇలాకాలో పగటిపూట లైట్లు!

పిఠాపురంలో అధ్వానంగా వీధిలైట్ల నిర్వహణ



పిఠాపురంలో గురువారం మధ్యాహ్నం వెలుగుతున్న లైట్లు

పిఠాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో పగటిపూట వీధిలైట్లు వెలుగుతూ ఉన్నాయి. పిఠాపురంలోని పలు ప్రాంతాల్లో కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి ఉంది. గురువారం మధ్యాహ్నం పట్టణంలోని రథాల పేట అంబేడ్కర్ సెంటర్‌లోని హైమాక్స్‌లైట్లుతో పాటు మెయిన్‌రోడ్డు, అగ్రహారం సహా పలు ప్రాంతాల్లోని ఎల్‌ఈడీ వీధిలైట్లు వెలుగుతూ కనిపించాయి. కొంతకాలంగా వీధిలైట్ల నిర్వహణ అధ్వానంగా ఉందని, వీధుల్లో లైట్లు వెలగక, రాత్రిళ్లు అంధకారం అలముకుంటున్నదని కౌన్సిల్ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు ఫిర్యాదులు చేశారు. అయి నా పరిస్థితిలో మార్పు రాకపోగా ఇప్పుడు పగటిపూటే లైట్లు వెలుగుతూ దర్శనమిస్తున్నాయి. వీధిలైట్ల నిర్వహణపై పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. దీని వల్ల పురపాలక సంఘంపై విద్యుత్ బిల్లుల రూపేణా అధిక భారం పడుతోందని పలువురు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీధి లైట్ల నిర్వహణపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి స్థల పరిశీలన

పెద్దాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు రామేశంమెట్ట ప్రాంతంలో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి స్థల అనుకూలతపై కలెక్టర్ షాన్ మోహన్ గురువారం పరిశీలన చేశారు. అలాగే స్టేడియం నిర్మాణానికి సంబంధించి ఏపీఐఐసీ స్థలాలను పరిశీలించారు. ఆయన వెంట జేసీ రాహుల్‌మీనా, ఆర్డీవో శ్రీరమణి, తహశీల్దార్ సీహెచ్.వెంకటలక్ష్మీ తదితరులున్నారు.



ప్లాంట్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

పిఠాపురంలో వాహనాల తనిఖీ

పిఠాపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ సెంటర్‌లో గురువారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. డ్రంక్‌డ్రైవ్ జరిపి మద్యం తాగి ఉన్నట్లు గుర్తించిన వారి వాహనాలు, నెంబరు ప్లేట్లు, డాక్యుమెంట్లు లేని వాహనాలను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, డాక్యుమెంట్స్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్స్, ఇతరపత్రాలు అన్నీ ఉండేలా చూసుకోవాలని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ సూచించారు. లేకుంటే చట్టపరంగా చర్యలతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో సర్కిల్‌లోని ఎస్ఐలు, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి భారీ జరిమానా

కాకినాడ క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 32 మందికి కాకినాడ 1వ ఎస్‌జెఎస్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ భారీ జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. కాకినాడ వన్‌టౌన్ సీఐ మండల నాగదుర్గారావ్ తన సిబ్బందితో బుధవారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరిక్షించగా 32 మంది పట్టుబడ్డారు. వారిని గురువారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.3,20,000 జరిమానా విధించినట్లు సీఐ నాగదుర్గారావ్ తెలిపారు.

మాండవ్య స్వామి గ్రామోత్సవం

సామర్లకోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పురాతన ప్రసిద్ధి పొందిన మాండవ్యనారాయణ స్వామివారికి ధనుర్మాసం ముగింపోత్సవాలు పురస్కరించుకుని గురువారం స్వామివారి ఉత్సవమూర్తులను సూర్యవాహనంపై అలంకరించి సామర్లకోట పట్టణ వీధులమీదుగా గ్రామోత్సవం నిర్వహించారు. మాండవ్యనారాయణ స్వామికి, మహాలక్ష్మీ అమ్మవార్లకు ఆలయ పండితులు చక్రవర్తులు రఘురామ్ తదితర పండితులచే శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. గ్రామోత్సవంలో భక్తులు కానుకలు సమర్పించుకుని ఆశీర్వచనం పొందారు.



సంక్రాంతి సంబరాల్లో నటుడు గౌతంరాజు కుటుంబం



నటుడు గౌతంరాజు కుటుంబసభ్యుల గ్రూప్ ఫొటో

కరప, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సినీనటుడు భూపతి గౌతంరాజు కుటుంబసభ్యులు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కరపలోని నల్లా ఆనంద్ ఇంట్లో హైదరాబాద్, కాకినాడల నుంచి వచ్చిన గౌతంరాజు కుటుంబసభ్యులు శుక్రవారం సాయంత్రం నుంచి సంక్రాంతి వేడుకను అట్టహాసంగా జరుపుకున్నారు. భోగిమంట వేసి అందరూ కలిసి క్యాంప్ ఫైర్ ఆడారు. తెలుగుదనం ఉట్టిపడేలా చీరకట్టుతో, అనంతరం మోడ్రన్ డ్రెస్‌లతో ఫ్యాషన్ షో, క్యాట్ వాక్‌లు నిర్వహించారు. ఈ ఫ్యాషన్ షో సింగిల్స్ విభాగంలో భూపతి పార్వతి, కపుల్స్ విభాగంలో భూపతి ప్రశాంతి, రవివర్మ దంపతులు విజేతలుగా నిలిచారు. సౌండ్ బాక్స్ పెట్టుకుని హుషారు పాటలకు లయబద్ధంగా డ్యాన్స్‌లు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. పలురకాల ఆటలు ఆడి ఆనందంగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి సంక్రాంతి పండుగకు వీడ్కోలు పలికారు. ఈ వేడుకల్లో గౌతంరాజు కుటుంబసభ్యులు అంబిక, బిందు, సుజాత, ఇందిర, రాజారత్నం, కృష్ణకుమారి, అంబిక, స్వాతి, అశ్విని, దేవి, ప్రభాకర్‌స్వాతి, భాగ్యం పాల్గొన్నారు.



కొత్తపల్లిలో సంక్రాంతికి వీడ్కోలు పలుకుతూ ముగ్గుతో రథాన్ని లాగిన దృశ్యం

సంక్రాంతికి వీడ్కోలు

కొత్తపల్లి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ముక్కనుమతో సంక్రాంతి పండుగ గురువారంతో ముగిసింది. సంక్రాంతి పండుగ నెలరోజులు ముందు నుంచీ స్థానిక దేవాలయంలో నెల గంట మోగించడం పూర్వ సాంప్రదాయం. ఆ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ నెల గంట పెట్టినప్పటి నుంచీ సంక్రాంతి వరకు ఇంటి ముంగిళ్లల్లో రకరకాల ముగ్గులు వేయడం జరుగుతుంది. ముక్కనుమ పండుగ తెల్లవారుజాము నుంచీ మహిళలు ఇళ్ళ ముందు ఎవరికి వారు రథం ముగ్గులువేసి భోగిమంట దగ్గరకు తాడు వేసి లాగిన ముగ్గులు పెట్టిన అనంతరం సంక్రాంతి పండుగకు వీడ్కోలు పలికారు.



ఉప్పాడ బీచ్‌లో కేరింతలు కొడుతున్న పర్యాటకులు

బీచ్‌రోడ్డుకు పోటెత్తిన పర్యాటకులు

● ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికులకు ఇబ్బందులు

కొత్తపల్లి, జనవరి 16(ఆంధ్రజ్యోతి):గురువారం సంక్రాంతి పండుగ ఆఖరిరోజు కావడంతో ఉప్పాడ బీచ్ పర్యాటకులతో రద్దీ ఏర్పడింది. కొత్తపల్లి, పిఠాపురం,కాకినాడ పరిసర ప్రాంతా ల నుంచి పర్యాటకులు ఉప్పాడ తీరానికి చేరుకొని సముద్రంలో జలకాలాడారు. బీచ్‌రోడ్డులో పర్యాటకులు విచ్చేసిన వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడంతో ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లేందుకు దారిలేక పోవడంతో ప్రయాణి కులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పర్యాటకులు, వాహనాలతో బీచ్‌రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బీచ్ రోడ్డులో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో కొత్తపల్లి ఎస్ఐ జి. వెంకటేష్ ఆధ్వర్యంలో వాహనాలను పండూరు, గోర్స, పిఠాపురం మీదుగా కాకినాడ కు దారి మళ్లించారు.

చేబ్రోలులో ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



చల్లా రాజేశ్వరీ వీరకుమారికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో గురువారం జిల్లాస్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో ఇందులో పాలుపంచుకుని ఉత్సాహంగా రంగవల్లులు వేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులతో పాటు కూటమి ప్రతినిధులు పాల్గొన్నారు.

వార్డుల్లో పారిశుధ్యం అధ్వానం!

● పట్టించుకోని అధికారులు, నాయకులు

సామర్లకోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణంలో దాదాపు అన్ని వార్డుల లోనూ పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. పండుగ రోజుల ముందు నుంచీ ఆయా వార్డులలో పలు కూడలి ప్రాంతాలలో చెత్తాచెదారాలను తొలగించకపోవడం, మురుగుకాల్వలలో అవరోధాలను తొలగించకపోవడంతో దుర్గంధం వ్యాపించింది. బుధ, గురువారాలలో కూడా ఇదే దుస్థితి నెలకొనడంతో చెత్త కుళ్ళికుళించి పురుగులు పట్టే ప్రమాదపరిస్థితులు నెలకొన్నప్పటికీ పారిశుధ్య అధికారులు పట్టించుకున్న దాఖలాలులేవని పలువురు కౌన్సిలర్లు సైతం ఆరోపిస్తున్నారు. పారిశుధ్య పరిస్థితులను పర్యవేక్షించాల్సిన మున్సిపల్ ఉన్నతాధికారులు వార్డులు సందర్శించిన పాపానపోలేదని పలువురు కౌన్సిలర్లు వాపోతున్నారు. పట్టణంలో పలు బడ్డీ దుకాణాల వద్ద ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ కవర్లు జోరుగా విక్రయిస్తూ మురుగుకాల్వలలో మురుగునీరు పారుదలకు అవరోధంగా తయారవుతున్నప్పటికీ సదరు బడ్డీ దుకాణదారులపై చర్యలు తీసుకోకపోవడంతో ప్లాస్టిక్ వినియోగం పెరిగి పూడిక అవరోధాలు మరింత పెరుగుతున్నాయన్న ఆరోపణలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పారిశుధ్య పరిస్థితులు క్షీణించకుండా మెరుగైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



సామర్లకోటలో పేరుకుపోయిన చెత్తాచెదారాలు, మురుగుకాల్వ దుస్థితి



జగన్ ట్యాబ్‌లు..

● వీడియో గేమ్స్ ఆడుతున్న విద్యార్థులు..!



కరపలో జగన్ ట్యాబ్‌ల్లో వీడియో గేమ్స్ ఆడుతున్న విద్యార్థులు

కరప, జనవరి 16(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ పంపిణీ చేసిన ట్యాబ్‌లు విద్యార్థులకు మంచి కాలక్షేపంగా మారాయి. సంక్రాంతి సెలవులు కలిసిరావడంతో విద్యార్థులు ఆ ట్యాబ్‌లతో బహిరంగ ప్రదేశాలు, అరుగుల మీద కూర్చుని వీడియోగేమ్స్ ఆడుతున్నారు. వైఫై ఉన్నచోట గుంపు లు గుంపులుగా పోగై తనివితీరా వీడియోగేమ్స్‌ను ఆస్వాదిస్తున్నారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంవల్ల ప్రజాధనం వృథాకావడంతోపాటు విద్యార్థుల బంగారు భవిష్యత్ నాశన మయ్యే దుస్థితి దాపురించిందని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరపలోని మెరకవీధి వినాయకుడి గుడి వద్ద పలువురు విద్యార్థులు ట్యాబ్‌ల్లో వీడియో గేమ్స్ ఆడుతుండగా అటుగా వెళుతున్న ఒక వ్యక్తి తీసిన ఫొటోలు వైరల్ అయ్యాయి.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



రోడ్డు భద్రతా మాసోత్సవాలు

తుని రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ తుని డిపో పరిధిలో రహదారి భద్రతా మాసోత్సవాలను డిపో మేనేజర్ రవి గురువారం ప్రారంభించారు. జీరో యాక్సిడెంట్ రికార్డు కలిగిన డ్రైవర్లకు నగదు బహుమతులతో పాటు పలు ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



మోతుగూడెం ఫోర్‌బై రిజర్వాయర్ వద్ద మంచు కురుస్తున్న దృశ్యం

మన్యాన్ని వణికిస్తున్న చలి

మోతుగూడెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. చలి తీవ్రతతో ఏజెన్సీ వాసులు వణుకుతున్నారు. ఉదయం 10.30 గంటల వరకు పొగ మంచు దట్టంగా కురుస్తోంది. మధ్యాహ్నం రెండు గంటలు మాత్రమే ఎండ కాస్తోంది. పగలు, రాత్రి తేడా లేకుండా చలి ప్రభావం చూపుతోంది. జనం స్వెట్టర్లు వేసుకుని చలి మంటలు కాగుతూ రక్షణ పొందుతున్నారు.



కూనవరంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కూనవరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కూనవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 20ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. పలు ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన వారంతా కలుసుకుని చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. వనభోజనాలు ఏర్పాటు చేసుకుని గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మచ్చా వినయ్‌ప్రసాద్, నాచుపల్లి వెంకన్న, సూరం వెంకట్, యాలం గౌతమ్, కొండా పద్దయ్య, పెద ముత్యం వెంకటేష్, కాలేపు ఉమామహేశ్వరి, స్వాతి, అపర్ణ, సౌందర్య, లలిత తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంటు ప్రారంభ కార్యక్రమంలో క్రీడాకారులు

పొల్లూరులో క్రికెట్ టోర్నమెంటు

మోతుగూడెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా పొల్లూరులో గుర్తుత్తి గోవిందరాజు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. మహిళలకు ముగ్గులు పోటీలు పెట్టారు. పోటీల్లో పాల్గొన్న వారికి భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. పొల్లూరు గ్రామస్థులు, ఏపీ జెన్‌కో అధికారుల సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో పొల్లూరు యూత్, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఆయుర్వేద ఆసుపత్రికి తాళాలు వేసి వున్న దృశ్యం

మూతపడిన ఆయుర్వేద ఆసుపత్రి

11ఏళ్లుగా తెరుచుకోని వైనం.... గిరిజన, గిరిజనేతరులకు అందని వైద్యం

పట్టించుకోని అధికారులు

మోతుగూడెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రికి 11ఏళ్ల క్రితం వేసిన తాళం అలాగే వుంది. నలభై ఏళ్ల క్రితం ఇక్కడ ఏర్పాటుచేసిన ఆయుర్వేద ఆసుపత్రి ఈ ప్రాంత ప్రజలకు మంచి సేవలు అందించింది. 2014లో రాష్ట్ర విభజన తర్వాత ఇక్కడ పని చేసిన వైద్యులు, సిబ్బంది తెలంగాణకు వెళ్లిపోయారు. ఏపీ నుంచి ఎవరూ రాకపోవడంతో ప్రస్తుతం మూతపడింది. ఈ ఆసుపత్రిలోని విలువైన మందులు పాడైపోయాయి.

అధికారులు స్పందించి తెరిపించే ప్రయత్నం చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సత్యహరిశ్చంద్ర నాటకంలో కాటి సీను, సత్యహరిశ్చంద్రుడిగా అలరించిన ప్రముఖ రంగస్థల కళాకారుడు వీఎస్ మాధవ్

అలరించిన సత్యహరిశ్చంద్ర నాటకం

ప్రత్తిపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో గౌరీశంకరుల 88వ వార్షికోత్సవ మహోత్సవా సందర్భంగా బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు కొనసాగిన సత్యహరిశ్చంద్ర నాటకం అలరించింది. రాష్ట్రంలోని ప్రముఖ రంగస్థల కళాకారులు పాత్రధారులుగా చక్కటి పద్యధారణతో మంత్రముగ్ధులను చేశారు. ఒకటవ సత్యహరిశ్చంద్రుడిగా సీవీ కృష్ణచైతన్య, రెండవ సత్య హరిశ్చంద్రుడిగా వీఎస్ మాధవ్, చంద్రమతిగా కిలారి లక్ష్మి, నక్షత్రుడిగా నర్సీపట్నం శ్రీనివాస్, విశ్వామిత్ర, వీరబాహుడిగా బగారి విజయసారథి, మాతంగిగా ఎం.సాంబశ్రీ తమ నటనతో మెప్పించారు. సత్యవాక్కు కోసం సత్యహరిశ్చంద్రుడు, చంద్రమతి కుటుంబం పడిన కష్టం ఇతివృత్తంగా ఈ నాటకంలో కళాకారులు అద్భుతంగా నటించి కళాభిమానుల ప్రశంసలు అందుకున్నారు. గౌరీ శంకరుల ఉత్సవాలకు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు రూ.25వేలు విరాళం అందించారు. ఉత్సవ కమిటీ సభ్యులు కిల్లాడి బాబ్జీ, కోనేటి రాజబాబు, గొనగాల రామకృష్ణ బృందానికి ఈ నగదును అందజేశారు. కార్యక్రమంలో జువ్వల దొరబాబు, కోలా తాతబాబు, పోకనాటి వెంకటేశ్వర్లు, దాడి పుత్రయ్య, నల్లా వెంకటేష్, బొల్లు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం, సాయిబాబా చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగిస్తున్న దృశ్యం

దైవనామస్మరణతో మానసిక ఆనందం

కిర్లంపూడి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మానసిక, శారీరక ఆనందాన్ని, ఆధ్యాత్మికతను అందించే దైవనామస్మరణే జీవన్ముక్తికి సోపానమని శ్రీసత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు పేర్కొన్నారు. మండలంలోని వీరవరంలో శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ తోట సర్వారాయుడు, నిర్వాహకులు తోట పాపారావునాయుడు, రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి వంద గంటల అఖండ దివ్య నామ సంకీర్తన మహా యజ్ఞాన్ని గురువారం ఉదయం ఆయన ప్రశాంతి పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. వయోభేదం లేకుండా దైవ నామస్మరణ చేయడం ద్వారా భగవంతుని అనుగ్రహాన్ని పొందవచ్చని ఎన్.ఉషారాణి, డాక్టర్ డీఎస్‌డీ శ్యామల పేర్కొన్నారు. సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామని నిర్వాహకులు పాపారావునాయుడు, రాజ్యలక్ష్మి తెలిపారు. బాబా చిత్రపటం, పాదుకలకు అష్టోత్తర పూజ చేసి వేద పారాయణ, నామ సంకీర్తనలతో గ్రామంలో ఊరేగించారు. కన్వీనర్లు తుమ్మలపల్లి జోగేంద్రనాథ్, జయబాబు, కాశీవిశ్వేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

బొర్రంపాలెంలో పోలీసు గ్రామసభ

గండేపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్రంపాలెంలో జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నేరాల నియంత్రణ, డ్రగ్స్ వద్దు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళా రక్షక్‌పై అవగాహన కల్పించారు. యువత మత్తుకు దూరంగా ఉండాలన్నారు. రోడ్లపై వెళ్లేటప్పుడు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మహిళలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తమకు తెలియజేయాలని, మహిళా పోలీసులు అండగా ఉంటారన్నారు. ఇటీవల సైబర్ నేరాలు అధికమయ్యాయని, వాటిని అవగాహనతో నియంత్రించవచ్చన్నారు. గండేపల్లి ఎస్ఐ యూవీ శివనాగబాబు, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రాజుపేటలో కోలాటం ఆడుతున్న ఎమ్మెల్యే దివ్య

సంక్రాంతి ముగింపు వేడుకలు

తుని రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాజుపేటలో మూడు రోజులు జరిగిన సంక్రాంతి సంబరాలు ముగింపు వేడుకలకు ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమెకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. కోలాటంలో ఎమ్మెల్యే చేయి కలిపి ఉత్సాహపరిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సుర్ల లోవరాజు, చింతమనీడి నాగసోమరాజు(అబ్బాయి), కోడా వెంకటరమణ, తమరాన సత్యనారాయణ, రొంగల అబ్బు తదితరులు పాల్గొన్నారు.



గోకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివ్య

'గోసంపద రక్షణకు అధిక ప్రాధాన్యం'

తొండంగి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గోసంపద రక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ. 2.30 లక్షలతో శృంగవృక్షంలో నిర్మించిన గోకులాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. మండలంలో 13 గోకులాలకు ప్రతిపాదనలు అందాయని, రైతులు విరివిగా నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, జనసేన నేత బెండపూడి నాయుడు, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కొయ్యా రామకేశవ, కొయ్యా సూరిబాబు, దూలం వీరబాబు, మత్స్యకార నేత కోడ వెంకటరమణ, చొక్కా అప్పారావు, ఎంపీడీవో రాజేశ్వరరావు, ఉపాధి హామీ ఏపీఎం రామచంద్రరావు, ఏఈ నానిబాబు పాల్గొన్నారు.

మోసాలపై అవగాహన

జగ్గంపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు గురువారం జేవీఆర్ అపార్ట్‌మెంట్‌వాసులకు డ్రగ్స్, ఇంటి దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బ్యాగ్ లిఫ్టింగ్, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలు, వివిధ రకాల మోసాలపై అవగాహన కల్పించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎస్ఐ రఘునందనరావు పాల్గొన్నారు.

ముద్రగడ పర్యటన

ప్రత్తిపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినశంకర్లపూడి గ్రామంలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం గురువారం పర్యటించారు. సర్పంచ్ ఏపూరి రామారావు ఆధ్వర్యంలో గ్రామస్థులు స్వాగతం పలికారు. దళే చిట్టిబాబు, గజ్జెల లోవరాజు, ఏపూరి నాగమణి పాల్గొన్నారు.



హరిదాసును సన్మానిస్తున్న వీర వెంకట దుర్గ నాట్యమండలి సభ్యులు

ముగిసిన సంక్రాంతి సంబరాలు

ప్రత్తిపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్రాంతి సంబరాలు గురువారం ముగిశాయి. ముక్కనుమను పురస్కరించుకుని రహదారులను ముగ్గులతో ముంచెత్తి సంక్రాంతిని సాగనంపారు. ధర్మవరంలో హరిదాసు ఎస్.రాధామనోహర్‌ను వీర వెంకట దుర్గ నాట్య మండలి అధ్యక్షుడు సానా నూకరాజునాయుడు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు సిద్ది పెద్దిరాజు, నిమ్మకాయల పెద్దకాపు, గళ్ళ బాబూరావు, బైరారాజు తదితరులు పాల్గొన్నారు.



రౌతులపూడిలో స్తంభించిన ట్రాఫిక్

ట్రాఫిక్ కష్టాలు

రౌతులపూడి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి వచ్చి తిరుగు ప్రయాణమైన వారికి ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి. హైదరాబాద్, కాకినాడ, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు సంక్రాంతికి వచ్చారు. మూడు రోజులు బంధువులతో సరదాగా గడిపారు. ఉద్యోగం, వ్యాపారాలు, ఇతర పనుల నిమిత్తం పయనమయ్యారు. దీంతో రౌతులపూడిలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. రౌతులపూడి పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను సరిదిద్దడంతో ఇబ్బంది లేకుండా వాహనచోదకులు ప్రయాణాలు కొనసాగించారు.



ఏలేశ్వరం కాంప్లెక్స్‌లో ప్రయాణికులు

తిరుగు ప్రయాణం

ఏలేశ్వరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి వివిధ ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన వారు తిరుగు ప్రయాణమయ్యారు. రాజవొమ్మంగి, అడ్డతీగల, వైరామవరం, కాకినాడ, రాజమహేంద్రవరం బస్సుల్లో వెళ్లడానికి గురువారం ఏలేశ్వరం కాంప్లెక్స్‌కు ప్రయాణికులు పెద్ద సంఖ్యలో వచ్చారు.



బాబి కుటుంబాన్ని పరిమర్శిస్తున్న నానాజీ

బాబి కుటుంబానికి పరామర్శ

కిర్లంపూడి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి సొసైటీ మాజీ అధ్యక్షుడు చదలవాడ బాబి మాతృమూర్తి చిన్నాదేవి ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలిసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ బాబి తండ్రి రాంబాబు, వేణు, కుటుంబీకులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట పంతం సూరిబాబు, జేడీ పవన్, గుడాల రామకృష్ణ, పట్టాభిరాం, పీడీలు కిరణ్, శ్రీను, ప్రభు, బుర్రి శ్రీరాములు, తూము శ్రీరామ్మూర్తి, రాపేటి సంతోష్, రాపేటి ప్రసాద్ ఉన్నారు.



కళాకారులకు సత్కారం

తుని రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కళను, కళాకారులను ప్రోత్సహించేందుకు తుని ఎమ్మెల్యే యనమల దివ్య సారథ్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించినట్లు టీడీపీ సీనియర్ నాయకుడు, తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు తెలిపారు. వి.కొత్తూరు ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో సాంస్కృతిక ప్రదర్శనలతో గ్రామస్థులను అలరించిన పలువురు కళాకారులను గురువారం సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తమరాన సత్యనారాయణ, రొంగల అబ్బు, శ్రీను పాల్గొన్నారు.

అనాథ శవానికి దహన సంస్కారాలు

జగ్గంపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంత మార్కెట్‌లో గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న భారతీయ ధర్మ పరిషత్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్రచౌదరి సొంత ఖర్చులతో దహన సంస్కారాలు జరిపించారు.